449) గుండక్రియ

ప॥ నేనేమి జేయగలేను నీవు పరిపూర్ణుడవు। హీనుడ నే నధికుడ విన్నిటా నీవు॥

చ॥ దండముపెట్టుట నాది తప్పు లోగొనుట నీది। నిండి నీవెపుడు దయానిధివి గాన।
అండబేరుకొంట నాది అందుకు నూకొంట నీది। దండియైన దేవదేవోత్తముడవు గాన॥

చ॥ శరణుజొచ్చుట నాది సరుగ గాచుట నీది। పరమపురుష శ్రీపతివి నీవు।
విరులు చల్లుట నాది వేవేలిచ్చుట నీది। పొరి నీవు భక్తసులభుడ వటుగాన॥

చ॥ దాసుడననుట నాది తప్పక యేలుట నీది। ఆసదీర్చేవరదుడ వటుగాన।
నీసేవ యొక్కటి నాది నిచ్చలు గైకొంట నీది। యీసులేనిశ్రీవేంకటేశుడవుగాన॥